సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



క్రీడాపోటీలకు ముస్తాబు

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు క్రీడా పోటీలు జరగనున్నాయి. 8లో



..డీఈఓను తొలగించాలి

డీఎస్సీ కౌన్సెలింగ్‌లో డీఈఓ, కార్యాలయ సిబ్బంది అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 24°

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా ఉంటుంది. రాత్రికి కొన్ని చోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం యాగశాలలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం చండీహోమంతో పాటు అమ్మవారికి 108 సువర్ణపుష్పాలతో సువర్ణపుష్పార్చన పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చిన అర్చకులు యాగశాలలో మండపారాధన, గణపతిపూజ అనంతరం చండీహోమం చేశారు. హోమంలో 14జంటలు పాల్గొనగా శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పూజల్లో ఈఓ రజనీకుమారితో పాటు వేదపండితులు, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు నవంబర్ రెండో వారంలో నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శాస్త్ర – సాంకేతిక రంగం – భవిష్యత్‌లో సుస్థిర అభివృద్ధి' అనే ప్రధానాంశంపై పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉప అంశాలుగా అహారం – ఆరోగ్యం – పరిశుభ్రత, మ్యాథమెటిక్స్ మోడల్ – కాంపిటేషన్ థింకింగ్, రవాణా-కమ్యూనికేషన్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, సహజ వ్యవసాయం, వనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణ అంశాల ఆధారంగా మాత్రమే ఎగ్జిబిట్స్ నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ప్రతీ పాఠశాల నుంచి కనీసం 5 నుంచి 7 ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుందని తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులను జూనియర్లుగా, 9, 10 తరగతుల వారిని సీనియర్లుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్, మైనార్టీ, ఆశ్రమ పాఠశాలలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. 2023 లో ఇన్‌స్పైర్ మనాక్‌లో 86 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున మంజూరు చేశారని తెలిపారు. వీరికి నవంబర్ రెండో వారంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు (92472 96012) ను సంప్రదించాలని సూచించారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కుమురం భీం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పీఓ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన భీం శైలి గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఏఓ రాంబాబు, ఆర్‌సీఓ నాగార్జున రావు, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, అధికారులు భాస్కర్, రవీంద్రనాథ్, మనిధర్, రమణయ్య, అలివేలు మంగతాయారు, ప్రభాకర్ రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

ట్రైకార్ వాహనాలు పంపిణీ..

ట్రైకార్ పథకం కింద నిరుద్యోగ గిరిజన యువతకు మంజూరైన వాహనాలను పీఓ రాహుల్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ వాహనాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మరో కార్యక్రమంలో మహిళలు స్వయం ఉపాధి యూనిట్ నిర్మాణానికి చెక్కు అందించారు.

తాత్కాలిక బోధన సిబ్బందికి ఆహ్వానం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయుటకు బోధన సిబ్బంది కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ తెలిపారు. పీజీలో 55 శాతంతో పాటు 55% తో నెట్, సెట్, పీహెచ్‌డీల్లో ఏదైనా ఒకటి కలిగి ఉండాలని పేర్కొన్నారు. తెలుగు, జువాలజీ, కంప్యూటర్ సైన్స్‌కు రెండు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, హిస్టరీల్లో ఒక్కో పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. కామర్స్‌లో మూడు పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 18 నుంచి 25 వరకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చిన్నచూపెందుకు?

పంచాయతీరాజ్ నిధుల్లో ఏజెన్సీపై పక్షపాతం

- మంత్రుల ఇలాకాకే ప్రాధాన్యత
- జిల్లాకు మొక్కుబడిగానే కేటాయింపులు
- రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు



కరకగూడెం మండలంలో వాహనాలు వెళ్లే మార్గం లేక డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

'వడ్డించేది మనవాడైతే పంక్తిలో ఎక్కడ కూర్చున్నా లోటుండదు' అనే నానుడిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు నిజం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంత నియోజకవర్గాల అవసరాలకంటే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే మంత్రులు అధిక ప్రాధాన్యత ఇస్తుండడమే ఇందుకు కారణం.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

జిల్లాకు రూ.75 కోట్లే..

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇటీవల 92 నియోజకవర్గాలకు రూ.1,323 కోట్లు మంజూరు చేసింది. ఇందులో జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున మొత్తం రూ.75 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్తగా 41 పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్ విభాగం చేపట్టే రోడ్ల నిర్మాణానికి కనిష్టంగా రూ.60 లక్షల నుంచి గరిష్టంగా రూ.90 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇక ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు అరకొరగానే సాగనున్నాయి. అడవులు, గుట్టలు, వాగులతో కూడి గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో నాణ్యమైన రహదారుల అవసరం చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే రహదారులు లేక డోలీలే దిక్కవుతున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి. అంబులెన్స్‌లు సకాలంలో వెళ్లనేని పల్లెలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు తాజా కేటాయింపుల్లో సముచిత స్థానం దక్కలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఇదేం తీరు..?

పినపాక నియోజకవర్గంలో పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మొత్తం ఏడు మండలాలు ఉండగా కేటాయించింది రూ.15 కోట్లే. ఇక ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో రఘునాథపాలెం ఒక్కటే గ్రామీణ మండలం కాగా, ఈ ఒక్కదానికే ఏకంగా రూ. 25 కోట్లు కేటాయించారు. ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం మండలాల్లో అనేక గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారి సౌకర్యం లేదు. అయినా నిధులు మాత్రం మొక్కుబడిగానే దక్కాయి. దీంతో జిల్లా అవసరాలను పట్టించుకోవడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వచ్చినవి పంచాల్సిందే..

ఇల్లెందు, భద్రాచలం నియోజవకర్గాలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. అయితే ఇల్లెందు నియోజకవర్గంలో కామేపల్లి మండలం ఖమ్మం జిల్లాలో ఉండగా గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జిల్లాలో ఉన్నాయి. దీంతో వచ్చిన రూ.15 కోట్లు ఈ మండలాలకూ కేటాయించాల్సి ఉంటుంది. భద్రాచలం విషయానికి వస్తే వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇక పొరుగున ఉన్న మహబూబాబాద్ నియోజకవర్గానికి ఏకంగా రూ. 34 కోట్లు, ములుగుకు రూ.20 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. ఏ ప్రాతిపదికన తీసుకున్నా పంచాయతీరాజ్ శాఖ తాజాగా చేసిన కేటాయింపుల్లో భద్రాద్రి జిల్లాకు సరైన న్యాయం జరగలేదనే అంశాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పనులు, నిధుల కేటాయింపు ఇలా..

నియోజకవర్గం	పనులు	నిధులు
భద్రాచలం	05	రూ.15 కోట్లు
అశ్వారావుపేట	07	రూ.15 కోట్లు
కొత్తగూడెం	06	రూ.15 కోట్లు
పినపాక	09	రూ.15 కోట్లు
ఇల్లెందు	14	రూ.15 కోట్లు
ఖమ్మం	12	రూ.25కోట్లు
పాలేరు	12	రూ.25కోట్లు
మధిర	06	రూ.25కోట్లు
వైరా	05	రూ.15కోట్లు
సత్తుపల్లి	08	రూ.15కోట్లు

మంత్రుల నియోజకవర్గాల్లో ఇలా..



సరైన రోడ్డు లేని మార్గంలో నడుస్తున్న ఆదివాసీలు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు రూ.25 కోట్ల వంతున మొత్తం రూ.75 కోట్లు కేటాయించారు. ఈ మూడూ మైదాన ప్రాంతానికి చెందినవి కాగా, అందులో రెండు జనరల్ స్థానాలు. భద్రాద్రి జిల్లాలో ఒక జనరల్, నాలుగు ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. ఐదూ ఏజెన్సీ నియోజకవర్గాలే. తార్కికంగా ఆలోచిస్తే ఇక్కడే వెనుకబాటుతనం ఎక్కువగా ఉంటుంది. దానికి తగ్గట్టుగా రోడ్ల నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ తాజాగా పంచాయతీరాజ్ శాఖ కేటాయించిన నిధుల విషయంలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి.

భద్రాచలానికి 'రిమోట్ ఆపరేటెడ్ బోట్'

గోదావరి నదిలో మొదటి రోజు 35 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



రిమోట్ ఆపరేటెడ్ లైఫ్‌బోయ్ బోట్ పని విధానంపై శిక్షణ ఇస్తున్న కంపెనీ ప్రతినిధి

భద్రాచలంఅర్బన్: జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం భద్రాచలానికి నూతన రిమోట్ ఆపరేటెడ్ లైఫ్‌బోయ్ బోట్‌ను అందించింది. ఈ రిమోట్ బోట్ ఖరీదు సుమారు 5 లక్షలు. వరదనీటిలో, జలాశయాల్లో ఎవరైనా చిక్కుకున్నప్పుడు రిమోట్‌తో ఆపరేట్ చేసి బోట్‌ను ఆపదలో ఉన్న వ్యక్తి వద్దకు పంపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చొచ్చు. 800 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా రిమోట్ ఆపరేషన్ ద్వారా రక్షించే అవకాశం ఉంది. ఈ లైఫ్ బోట్ ఆపరేట్ చేయడం, ఆపదలో ఉన్న వారిని రక్షించడం, నిర్వహణ తదితర అంశాలపై భద్రాచలం గోదావరి నదిలో జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన 35 మంది ఫైర్ సిబ్బందికి గురువారం శిక్షణ ప్రారంభించగా, శుక్రవారం కూడా కొనసాగనుంది. రాష్ట్ర స్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ముంబయికి చెందిన శ్రీలలిత కంపెనీ ప్రతినిధి మనోజ్ సావస్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం, ఇల్లెందు అగ్నిమాపక శాఖ అధికారులు జి.శ్రీనివాస్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

'బెళగావి' పునరుద్ధరణ

మణుగూరు టౌన్: దాదాపు ఏడాది తర్వాత మణుగూరు – బెళగావి రైలును సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు పునరుద్ధరించగా గురువారం మధ్యాహ్నం మణుగూరు నుంచి బయలుదేరింది. ఇక్కడి ప్రజలు, కార్మికుల విజ్ఞప్తి మేరకు.. ఆరునెలల వ్యవధిలో వారంలో నాలుగు రోజుల పాటు మొత్తం 95 ట్రిప్పులు తిప్పేలా రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరికొన్ని ట్రిప్పులు పెంచే అవకాశం ఉండొచ్చని అధికారులు అంటున్నారు. ఈ రైలు బయలుదేరిన 26 గంటల తర్వాత బెళగావి చేరుకుంటుంది.

భక్త శబరికి స్మృత్యంజలి



వినాయకపురంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఈఓ రమాదేవి

- రామాలయంలో ఫల, పుష్పాల సమర్పణ
- గిరిజన గ్రామంలో రామయ్యకు కల్యాణం
- ఏపీలోని శబరి నది వద్ద అర్చకుల అభిషేకం

భద్రాచలం/అశ్వారావుపేట రూరల్: గిరిజన భక్తురాలు, రామయ్యకు ఎంగిలి పండ్లను నైవేద్యంగా సమర్పించి ముక్తిని పొందిన భక్త శబరికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా స్మృత్యంజలి నిర్వహించారు. ప్రతీ ఏడాది అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున శబరి స్మృతి యాత్ర జరపడం ఆనవాయితీ. ఈ సంవత్సరం భద్రాచలం ఆలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గిరిజనుల చెంతనే స్వామివారి కల్యాణం జరిపించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూనవరంలో శబరి నది వద్ద గల విగ్రహానికి అభిషేకం చేశారు. ఇలా ఆలయం ఆధ్వర్యంలో ఒకేరోజు మూడు చోట్ల పూజలు జరిపి శబరికి ఘన నివాళులు అర్పించారు.

గిరి ప్రదక్షిణ, ఫల, పుష్పాంజలి..

భద్రాచలంలో గిరి ప్రదక్షిణతో శబరి యాత్ర ప్రారంభమైంది. అపర భక్తురాలి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ చేశారు. చప్టా దిగువన ఉన్న తూము నరసింహదాసు, వైకుంఠ ద్వారం వద్ద గల భక్త రామదాసు విగ్రహాలకు పూలమాలలు అలంకరించి హారతి సమర్పించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వార్లకు, శబరి చిత్రపటానికి పలు రకాల పండ్లు, పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి పుష్పాంజలి ఘటించిన తర్వాత స్వామి వారి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు అర్చకులు వస్త్రాలు సమర్పించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ, ప్రధానార్చకులు విజయరాఘవన్, అర్చకులు, సిబ్బంది, గిరిజన కుల పెద్దలు పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అయితే భద్రాచలంలో కనీసం గిరిజన సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలు ఈ ఉత్సవంలో కనిపించకపోవడం లోటుగా భక్తులు భావించారు. ప్రతి ఏడాది అట్టహాసంగా జరిగే వేడుక ఈ ఏడాది సాదాసీదాగా సాగడం నిరుత్సాహపరిచింది.

కూనవరం వద్ద శబరికి అభిషేకం..

శబరి భక్తిని మెచ్చిన రామయ్య ఆమెను గోదావరికి ఉపనదిగా ముక్తిని ప్రసాదించాడని ప్రతీతి. ఆంధ్రప్రదేశ్‌లోని వీఆర్ పురం – కూనవరం గ్రామాల నడుమ ఉన్న శబరి నది వద్ద దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కూనవరం వైపు ఉన్న శబరి విగ్రహానికి నదీ జలంతో అభిషేకం చేశారు. అనంతరం రామయ్య తరఫున తీసుకెళ్లిన వస్త్రాలతో అలంకరించి నైవేద్యం, హారతి సమర్పించారు.

వినాయకపురంలో రామయ్య కల్యాణం..

గిరిజనుల సమక్షంలో అపర భక్తురాలైన శబరిని స్మరించుకునేందుకు ఈఓ రమాదేవి తొలిసారి గిరిజన గ్రామంలో రామయ్యకు కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి అశ్వారావుపేట మండలం వినాయకపురంలోని ముత్యాలమ్మ ఆలయం వేదికగా మారింది. సీతాలక్ష్మణ సమైతుడైన రామయ్య ఉత్సవ మూర్తులతో వచ్చిన ప్రచార రథానికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆదివాసీ కొమ్ము నృత్యాలు, గిరిజన సంప్రదాయాలతో ఊరేగింపు జరిపారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా ఈఓ స్వామివార్లకు ఫల, పుష్పాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ముత్యాలమ్మ గుడి ఈఓ సూర్యప్రకాశ్, ఎంపీఓ సోయం ప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ సంతోష్, అర్చకులు ప్రసాద్, గ్రామ పెద్దలు నరాల శ్రీను, నల్లపు నర్సింహారావు పాల్గొన్నారు.



వినాయకపురం గ్రామంలో ఆదివాసీ నృత్యాలతో ఊరేగింపు

ఆకర్షించేలా ట్రైబల్ మ్యూజియం

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి

దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు ఆ తర్వాత గిరిజన మ్యూజియాన్ని సందర్శించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వారిని ఆకట్టుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మండలంలోని బొజ్జిగుప్ప, నారాయణరావుపేట గ్రామాల్లో గిరిజన సంస్కృతికి సంబంధించిన నివాసాలను గురువారం ఆయన పరిశీలించారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. గ్రామాల్లో పాత కాలం నాటి ఇళ్లకు రంగులన్నీ గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. గ్రామాలను సందర్శించే పర్యాటకులకు గిరిజన సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకాలని సూచించారు. కుర్చీలు, పడకలన్నీ వెదురుతోనే తయారు చేయాలన్నారు. వంటకాల్లోనూ దుంప, ఆకు కూరలే ఉండాలని, రాగి, జొన్న జావా అందించాలని చెప్పారు. అనంతరం గిరిజన వంటకాలను కలెక్టర్ భుజించారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్ కుమార్, ఆర్ఐ నరసింహారావు, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి ఉన్నారు.



గిరిజనులు చేసిన రాగిజావ రుచి చూస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆదికవి వాల్మీకి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామాయణం రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటాయని అన్నారు. బోయ కులానికి చెంది, చోరుడైన వాల్మీకి స్ఫూర్తితో ఎంతోమంది రచయితలుగా, కవులుగా మారారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీ సంక్షేమాధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, బీసీ సంఘం నాయకులు మురికి వెంకన్న, బోగా నందకిషోర్, ఉలవల రాములు, గట్టేశం, కొదుమూరి సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, చల్లా శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయితీ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీపీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

శిశు గృహ సందర్శన

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని శిశు గృహాన్ని కలెక్టర్ పాటిల్ గురువారం సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న ఆహారం, సదుపాయాలు, చిన్నారుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిశు గృహానికి కావాల్సిన సదుపాయాల పై సిబ్బందిని అడగగా, చిన్నారుల కోసం ఊయలలు, డైనింగ్ టేబుల్, అంతర్గత సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. వాటి కోసం ప్రతిపాదనలు పంపిస్తే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వైదిక కమిటీ వర్సెస్ ఈఓ..!

- భద్రాచలంలో ఉపాలయాల మూసివేతపై ఈఓ ఆగ్రహం
- పరిచారకుల కొరతను సాకుగా చూపిన కమిటీ సభ్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వైదిక కమిటీ వర్సెస్ ఈఓ అన్నట్లుగా మారుతున్నాయి ఇటీవలి ఘటనలు. ఆలయంలో పనిచేస్తున్న కొందరు అర్చకులు, పండితులుపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఈఓ రమాదేవి ఇటీవల మెమోలు జారీ చేయగా, ఆ తర్వాత పరిణామాలు ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయి.

ఉపాలయాలకు తాళాలు..

రామాలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు, శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయాల్లో నిత్యం పూజలు జరుగుతుంటాయి. అయితే గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ ఉపాలయాలు మూతబడ్డాయి. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ సైతం ఆగిపోయింది. ఇవి సోషల్ మీడియాలో ప్రచారం కాగా, శబరి స్మృతియాత్ర, అశ్వారావుపేట మండలం వినాయకపురంలో స్వామివారి కల్యాణం కార్యక్రమాల అనంతరం ఆలయానికి వచ్చిన ఈఓకు విషయం తెలియడంతో వెంటనే వైదిక కమిటీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆలయాల మూసివేతపై వివరణ అడిగారు. శబరి ఉత్సవం సందర్భంగా భద్రాచలంతో పాటుగా వినాయకపురం, ఏపీలోని కూనవరం గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పరిచారికలు, అర్చకుల కొరత ఏర్పడిందని, అందుకే ఉపాలయాలు మూసివేశామని వారు తెలిపారు. అయితే శబరి ఉత్సవానికి గత పది రోజుల నుంచే ఏర్పాట్లు జరుగుతున్నందున పరిచారకులు, అర్చకులకు ముందుగానే విధులు కేటాయించే అవకాశం ఉన్నా, అలా ఎందుకు చేయలేదని ఈఓ ప్రశ్నించారు. కొద్ది రోజులుగా అర్చకులపై చర్యలు తీసుకోవడంతో కొరత ఏర్పడిందని కమిటీ సభ్యులు సమాధానం ఇవ్వగా ఈఓ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అర్చకులు చేస్తున్న తప్పులపై కఠినంగా వ్యవహరించడం వల్లే ఇలా ఆలయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారని, ఈ చర్యలను సహించేది లేదని ఈఓ చెప్పినట్లు సమాచారం.



తాళం వేసి ఉన్న అభయాంజనేయస్వామి ఉపాలయం

టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు..?

ఉపాలయాలు మూసివేసిన ఘటనలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు రంగం సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. పరిచారికలు లేకపోవడంతో భక్తులు మధ్యాహ్నం వరకు ఇబ్బంది పడినా తన దృష్టికి ఎందుకు తేలేదని ఈఓ ఆగ్రహంగా ఉన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి భక్తులను ఇబ్బంది పెట్టడం, ఆలయానికి చెడు పేరు రావడానికి కారణమంటూ కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఈఓ రమాదేవిని వివరణ కోరగా ఉపాలయాల మూసివేత విషయం సాయంత్రం వరకు తన దృష్టికి రాలేదని, తెలిసిన వెంటనే వైదిక కమిటీతో సమావేశం నిర్వహించి వివరణ అడిగి తెలుసుకున్నానని చెప్పారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వారందరిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయిలో ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్ ఫిల్మ్ తీసి పంపాలని కోరారు. వీటిని ఈ నెల 20 తేదీ లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో పీఆర్‌ఓకు అందజేయాలని కోరారు. 'మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసు సేవ, ఇతర సందర్భాల్లో పోలీసులు కీర్తి ప్రతిష్టలు, సైబర్ నేరాలు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనంతో అనర్థాలు' అంశాలపై 2023 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు తీసిన ఫొటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాలని కోరారు. వివరాలకు 87126 82121లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మనుబోతుల చెరువు, ఏఎంసీ కాలనీలో నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వీలైనంత త్వరగా మరమ్మతులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. గురువారం ఆయన ఇళ్లను సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆర్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.

టేకులపల్లి నుంచి ఇంద్రకీలాద్రికి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న విజయ్‌సాయి

టేకులపల్లి: టేకులపల్లిలోని శ్రీ కోదండ రామాలయం పూజారి శ్రీరంగం విజయ్‌సాయి చక్రి విజయవాడలో ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర ప్రారంభించారు. టేకులపల్లిలో గురువారం ప్రత్యేక పూజలు చేశాక ఆయన మాట్లాడుతూ దేవీశరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొత్తగూడెం, చంద్రుగొండ, తిరువూరు, మైలవరం మీదుగా ఇంద్రకీలాద్రి వరకు నాలుగు రోజుల పాటు 162 కి.మీ. పాదయాత్ర కొనసాగుతుందని వెల్లడించారు.

శ్రీవాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఆర్టీఓ సదానందం, ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రవాణాశాఖ కార్యాలయంలో జిల్లా రవాణాశాఖ అధికారి జి. సదానందం వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం?

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–4లో ఓబీ వెలికితీత పనులు నిర్వహిస్తున్న కంపెనీలో ఓ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో హాల్‌రోడ్డులో వాహనం నిలిపి వేసి పక్కనే ఉన్న సంప్‌లోకి దూకినట్లు తెలిసింది. ఓల్వో హాల్ రోడ్డుపై నిలిపి ఉంచడం గమనించిన తోటి డ్రైవర్లు అతడిని కాపాడి మణుగూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కాగా ఆసిఫాబాద్‌కు చెందిన కార్మికుడు ఉదయ్‌కిరణ్ కంపెనీ ఏర్పాటు చేసిన నివాసాల్లో కుటుంబంతో ఉంటున్నాడు. అప్పులు ఎక్కువ అవడంతో విధులకు తరచూ గైర్హాజరవుతున్నాడు. అతడు సంప్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, వీపు, తుంటికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. విరామం సమయంలో హాల్‌రోడ్డులో బండి నిలిపివేసి కట్ట వద్ద బహిర్భూమికి వెళ్లి కిందకు జారి పడ్డాడని తెలిపారు. ఎంఆర్‌ఐ స్కాన్ చేయించామని ప్రాణాపాయం లేదని కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, చిన్న గాయాలు అయ్యాయని పేర్కొన్నారు.

అక్రమాలకు పాల్పడిన డీఈఓను తొలగించాలి

- డీఎస్సీ–2024 పోస్టింగ్‌లలో పక్షపాత వైఖరి అవలంబించారు..
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన



డీఈఓ కార్యాలయం ముందు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ–2024 కౌన్సెలింగ్‌లో ఉద్దేశపూర్వకంగా జిల్లా విద్యాశాఖాధికారి చేసిన అక్రమాలపై, కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో గురువారం డీఈఓ కార్యాలయంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ డీఈఓ కార్యాలయంలో పని చేస్తున్న ఏపీఓ కిరణ్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని కోరారు. రెగ్యులర్ పోస్టుల్లో నియమితులైన తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులను, వారికి కేటాయించిన పోస్టుల్లో కొనసాగించాలన్నారు. ఓ సంఘం ఒత్తిడికి లొంగి అక్రమాలకు పాల్పడుతున్న డీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడిన డీఈఓను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ చేస్తున్న ఆరోపణలు..

- ములకలపల్లి మండలం ఎంపీ యూపీఎస్ సీతాయిగూడెం పాఠశాలను వేకెన్సీ లిస్టులో చూపడం లేదని, కానీ పాఠశాల అలాట్మెంట్‌లో ఉద్దేశపూర్వకంగా సోషల్ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థిని నియమించారని ఆరోపించారు.
- పాల్వంచ పట్టణంలోని బొల్లోరిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, ఆ పాఠశాలకు సోషల్ స్కూల్ అసిస్టెంట్‌ను అవసరం ఉందని డీఈఓకు విన్నవించామని తెలిపారు. కానీ ఆ పాఠశాలకు కేటాయించకుండా సీతాయిగూడెం పాఠశాలకు కేటాయించారని పేర్కొన్నారు. ఈ పోస్టును మరో స్కూలుకు షిఫ్ట్ చేయాలని కోరారు.
- కొత్తగూడెం మండలం పాత కొత్తగూడెం జీహెచ్‌ఎస్ పాఠశాలలో 254 మంది పిల్లలకు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఒక్కరు మాత్రమే ఉన్నారని, అక్కడ మరో ఆంగ్ల ఉపాధ్యాయుడు అవసరం ఉన్నా, ఆ పాఠశాల కంటే తక్కువ పిల్లలు ఉన్న పాఠశాలకు కేటాయించారని ఆరోపించారు.
- ములకలపల్లి మండలం ఎంపీ యూపీఎస్ సీతాయిగూడెం పాఠశాలలో 46 మంది పిల్లలు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ఆ పాఠశాలకు అవసరం లేకపోయినా ఒక ఎస్‌జీటీ పోస్టును కేటాయించారని పేర్కొన్నారు. ఈ పాఠశాల కంటే ఎక్కువగా దమ్మపేట మండలం మొండివర్రె పాఠశాలలో 65 మంది పిల్లలు ఉన్నా ఎస్‌జీటీని కేటాయించలేదన్నారు.
- పినపాక మండలం చేగర్శల యూపీఎస్, ఏడూళ్లబయ్యారం, దుమ్ముగూడెం మండలం దుమ్ముగూడెం జెడ్పీహెచ్‌ఎస్, అశ్వారావుపేట మండలం నారాయణపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఖాళీలు లేకపోయినా తెలుగు, హిందీ లాంగ్వేజ్ పండిట్ ఉపాధ్యాయులను కేటాయించారని, మళ్లీ వేరే పాఠశాలలో కేటాయించేందుకు ఉపాధ్యాయులను ఆవేదనకు గురి చేశారని అన్నారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం లక్ష్మీదేవిపల్లి ఉర్దూ పాఠశాలలో ఎస్‌జీటీ వేకెన్సీ చూపెట్టి కారుకొండ రామవరంలో పోస్టింగ్ ఇచ్చారని ఆరోపించారు.

ప్రభుత్వానికి సహకరించాలి

భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్ రావు

భద్రాచలంఅర్బన్: శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ముందస్తుగా ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లను, దుకాణాలను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోనుంది. ఈ క్రమంలో సదరు ఇళ్ల యజమానులతో గురువారం ఆయన సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, ప్రతి ఇంటికి, స్థలానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేస్తామని చెప్పారు. మీ సమస్యలు చెబితే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ అధికారి గనియా, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ చంద్రభాను



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ


ఇల్లెందురూరల్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ సూచించారు. మండలంలోని రాజీవ్‌నగర్‌తండాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టారు. పోలీసు సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఇన్సూరెన్స్, లైసెన్స్ లేని 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారు మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసుశాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. పాత బైక్‌ల కొనుగోలు సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనం కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ డాక్యుమెంట్ కలిగి ఉండాలని చెప్పారు. మాదకద్రవ్యాలు, గుట్కాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

వ్యక్తి మృతిపై డీఎస్పీ విచారణ

భద్రాచలంఅర్బన్: ఉద్యోగం తొలగించారని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదైన ఘటనలో గురువారం భద్రాచలం ఇన్‌చార్జి డీఎస్పీ వంగా రవీంద్రారెడ్డి విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హోటల్ మేనేజర్ నాగలక్ష్మి ఎటువంటి కారణం లేకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించారని పట్టణంలోని తెలంగాణ టూరిజం శాఖ హోటల్‌లో 12 ఏళ్లుగా పనిచేస్తున్న నరసింహారావును బుధవారం గుండెనొప్పితో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మేనేజర్ నాగలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో భద్రాచలం ఇన్‌చార్జి డీఎస్పీ రవీంద్రారెడ్డి టూరిజం శాఖ హరిత హోటల్ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా ఇదే విషయమై భద్రాచలం వచ్చిన తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ఏజీఎం జంగయ్యను వివరణ కోరగా.. నరసింహారావు మృతికి గల కారణాలు తెలుసుకుని, అతని కుటుంబానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా హోటల్ మేనేజర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వివిధ కుల సంఘాల నాయకులు టూరిజం ఏజీఎం జంగయ్యకు వినతిపత్రం అందించారు.

ట్రాలీ ఆటో బోల్తా : పది మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ దీపక్‌రెడ్డి

ములకలపల్లి: టాటా ఏస్ ట్రాలీ ఆటో బోల్తా పడి పది మంది స్వల్పంగా గాయపడిన ఘటన గురువారం జరిగింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లముడి, గండిపోలు గ్రామానికి చెందిన సుమారు 25 మంది గండిపోలుకు చెందిన టాటా ఏస్ ట్రాలీ ఆటోలో కొత్తగూడెంలో గురువారం జరిగే ఓ మీటింగ్‌కు బయలుదేశారు. మూడు కిలోమీటర్లు ప్రయాణించగానే కొమ్ముగూడెం గ్రామశివారులోని మూలమలుపు వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో వాహనం బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్నవారి సుమారు 10 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్, కాంగ్రెస్ నాయకుడు సురభి రాజేష్ తదితరులు కూడా ఘటనాస్థలికి వచ్చి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

మంగపేట పీహెచ్‌సీలో చికిత్స

ప్రమాదంలో గాయపడ్డ ఆరుగురికి మంగపేట పీహెచ్‌సీలో చికిత్స అందించారు. వైద్యాధికారి దీపక్‌రెడ్డి క్షతగాత్రులను పరీక్షించారు. నల్లముడికి చెందిన బానోత్ సునీత, లావుడ్య సావిత్రి, లావుడ్య నాగమ జీ, వాడె జయ, గండిపోలుకు చెందిన కే.నాగదుర్గ, కే.మహేశ్‌లకు ప్రాథమిక వైద్యం అందించారు. సునీతకు తలలో బలమైన గాయమై పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరికొందరు జగన్నాథపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని, వెనుదిరిగి వెళ్లారు. ఈఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సుజాతనగర్: బైక్‌ను కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... సుజాతనగర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్ ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్తూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం వైపు నుంచి వచ్చే ఓ కారు రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని గమనించి నెమ్మదించింది. ఆ వెనకాలే వచ్చిన మరో కారు ముందున్న కారును ఢీకొట్టింది. దీంతో అది వెళ్లి రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న శంకర్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని కొత్తగూడెం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఎస్సై జుబేదా బేగం ఘటనా స్థలానికి చేరుకుని రెండు కార్లను ఠాణాకు తరలించారు.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం

భద్రాచలంఅర్బన్: గోవాలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన వి.మల్లేష్ 105 కేజీల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడు. భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన మహంతి వెంకట కృష్ణాజి ఐదో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ జీవి.రావిరెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడి తొలగింపు

కొత్తగూడెంఅర్బన్: దసరా సెలవుల్లో హోంవర్క్ చేయలేదనే కారణంతో 6వ తరగతి విద్యార్థిని చితకబాదిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిని గురువారం విధుల నుంచి తొలగించారు. విద్యార్థికి జరిగిన నష్టంవల్ల ఉచిత విద్యనందించేందుకు పాఠశాల యాజమాన్యం అంగీకరించిందని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. ప్రైవేటు పాఠశాలల వారు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

బాబా ఆలయంలో చోరీ

పినపాక: మండలంలోని ఈ.బయ్యారం పంచాయతీ పరిధి సాయిబాబా ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుడి తలుపులు ధ్వంసం చేసి హుండీ పగులగొట్టి సుమారు రూ. 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

గుండాల: ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఆళ్లపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు ఆళ్లపల్లి ఎస్సై రతీష్ తెలిపారు. గుట్కా ప్యాకెట్ల విలువ సుమారు రూ. 12 వేలు ఉంటుందని, స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



జగదీష్ (ఫైల్)

ములకలపల్లి: వ్యక్తి అదృశ్యంపై గురువారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురంలో నివసించే కందిమళ్ల జగదీష్ మణుగూరుకు చెందిన డ్రైవర్ పెద్దోజు సురేశ్ వద్ద లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. డ్యూటీకీ రావాలని జూలై 9న డ్రైవర్ సురేశ్ ఫోన్ చేయగా, వెళ్లిన జగదీష్ రెండు నెలలు గడుస్తున్నా, నేటికీ ఇంటికి తిరిగి రాలేదు. బంధు మిత్రుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో రాజేశ్వరి గురువారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఇల్లెందు: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని మొండితోగు గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ బి.సూర్యా కథనం ప్రకారం.. మొండితోగుకు చెందిన తేనే సతీష్(35)కు పదిహేనేళ్ల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసగా మారి భార్యతో తరుచుగా ఘర్షణ పడుతుండటంతో ఆమె నాలుగేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచ: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వనమా కాలనీకి చెందిన కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి మహ్మద్ మహబూబ్ అలీ(64) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సమస్యలు తాళలేక ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 16న మృతి చెందాడు. మృతుడి కుమారుడు అమితాబ్ పాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్...

కొత్తగూడెంటౌన్: విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన ఘటనలో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... త్రీఇంక్‌లైన్‌లోని బంగ్లోస్ ప్రాంతంలో నివాసం ఉంటూ పెయింటర్ గమ్మికుంట కనకరాజు (32) జీవనం సాగిస్తున్నాడు. బుధవారం 4 ఇంక్‌లైన్ సమీపంలో ఓ భవనానికి పెయింటింగ్ వేసే క్రమంలో పరంజాకు ఉన్న పైపు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, తల్లి, సోదరి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడాపోటీలకు ముస్తాబైన కిన్నెరసాని

నేడు పోటీలను ప్రారంభించనున్న కలెక్టర్, ఐటీడీఏ పీఓ



క్రీడాపోటీల నిర్వహణకు లైనింగ్ కోసం ముగ్గు పోస్తున్న విద్యార్థులు



పీడీలు, పీఈటీలకు సూచనలు చేస్తున్న డీడీ మణెమ్మ

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో భద్రాచలం ఐటీడీఏ స్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ మేరకు స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. పోటీలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రారంభిస్తారని, ఉమ్మడి జిల్లాలోని 70 పాఠశాలల నుంచి 800మంది బాలబాలికలకు హాజరవుతారని జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు తెలిపారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, చదరంగం, క్యారమ్స్ విభాగాల్లో తొలిరోజు బాలికలకు, రెండో రోజు బాలురకు పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను గురువారం ఐటీడీఏ డీడీ మణెమ్మ పరిశీలించి సూచనలు చేశారు. ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, పాఠశాల హెచ్‌ఎం ఎల్.రామారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు

పోటీల నిర్వహణ ఖర్చులకు ఐటీడీఏ నుంచి రూ.50వేలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మైదానాన్ని చదును చేయించడం, క్రీడల వారీగా ఏర్పాట్లు చేయడంతో పాటు ముగ్గు పోయించడం వంటి పనులకు కూలీలను నియమించుకోవాలి. కానీ ఏర్పాట్ల బాధ్యతలు నిర్వర్తిస్తున్న పీడీలు, పీఈటీలు గురువారం మైదానంలో విద్యార్థులతో ముగ్గు పోయించడం తదితర పనులు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఇండియన్ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్యేల్



మాట్లాడుతున్న సామ్యేల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఇండియన్ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామ్యేల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు పాలేరులేనని, అంకితభావంతో సేవ చేయాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్‌లో తన ఎదుగుదలను ఓర్వలేక ఇబ్బందుల పాలు చేయడంతో ఆ పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. రాబోయే సర్పంచ్ ఎన్నికలలో 300 స్థానాల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. సభకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరవుతారని నిర్వాహకులు ప్రచారం చేసినా గైర్హాజర్ కావడంతో నిరుత్సాహానికి గురయ్యారు. యూనియన్ జాతీయ నాయకుడు మద్దిశెట్టి అజయ్, ఆలిండియా దళిత మోర్చా కమిటీ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ చిన రాములు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ముక్తి మల్లేష్, స్వర్ణ, బి.రవి, రాందాస్, ఐలయ్య, సమ్మయ్య, రమేష్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి హుండీ ఆదాయం రూ.7.03లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఉద్యోగులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర దసరా నుంచి బుధవారం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవాదాయ శాఖ అధికారి అనిల్ కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. ఆరు హుండీల్లో కలిపి రూ.7,03,006 ఆదాయం నమోదు కాగా, గత ఏడాదితో పోలిస్తే రూ.7 వేలు అదనమని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు. కాగా, ఈనెల 21వ తేదీ వరకు భక్తుల రద్దీ ఉంటుందని ఆ తర్వాత మరోమారు హుండీల్లో కానుకలు లెక్కించి, వేలం పాటల వివరాలతో సహా జాతర ఆదాయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి, మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ తదితరులు పాల్గొనగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పాల్వంచరూరల్: బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జగన్నాథపురం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఖమ్మం నుంచి లక్ష్మీపురం వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో రూ.లక్ష విలువైన బియ్యాన్ని 80 గోనె సంచుల్లో తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఖమ్మం నగరం అగ్రహారం ప్రాంతానికి చెందిన మొగిలి అశోక్, చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన డ్రైవర్ దుగ్గిరాల హరీష్, బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి చెందిన మిల్లు యజమాని సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు